సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 14 । మార్చి । 2023



ఆస్కార్ మాకు గర్వకారణం


ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య తాళ్లపూడికి చెందినవారే. ఈ సినిమాలోని 'నాటునాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడంపై ఇక్కడి హర్షం వ్యక్తం చేస్తున్నారు. - 8లో ▸



నిర్లక్ష్యంతో నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

చిన్నపాటి నిర్లక్ష్యం.. విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేసి, అస్వస్థకు గురి చేసింది. 40 మంది విద్యార్థులను ఆస్పత్రి పాల్జేసింది. - 8లో ▸

డెల్టాలకు 7,120 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 7,120 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.35 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

స్పందనకు 112 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టర్ కె.మాధవీలత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 112 అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ నరసింహులు, ఇతర జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, స్పందనతోపాటు 1902 కాల్ సెంటర్‌కు వచ్చిన ప్రతి అర్జీనీ నిర్ణీత సమయంలో నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. వస్తున్న అర్జీలను ఆర్థిక, ఆర్థికేతర అంశాల వారీగా విశ్లేషించుకుని పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన వాటిని సంబంధిత ఉన్నతాధికారులు ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. 1902 ద్వారా వచ్చిన ప్రతి అర్జీనీ సీఎం కార్యాలయం ద్వారా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రతి కార్యాలయంలోనూ అధికారులు, సిబ్బందికి ఫేషియల్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 400 స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 48 గంటల్లోగా పరిష్కరించాల్సినవి 7.. 24 గంటల్లోగా పరిష్కరించాల్సినవి 6, పది రోజుల్లోగా పరిష్కరించాల్సినవి 318 ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్



నైనా జైస్వాల్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో జీవించాలని, ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని ముందుకు దూసుకుపోవాలని ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ అన్నారు. సంహిత డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. ఉద్వేగాలను నియంత్రించుకుని, సరైన ప్రణాళికతో జీవితాన్ని మార్చుకోవాలని సూచించారు. ఇండియా నంబర్ వన్ క్రీడాకారిణి కావడానికి తాను ఎంతో కష్టపడ్డానని, ఈ విషయంలో తన తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహం మరువలేనిదని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ మాట్లాడుతూ, నైనా జైస్వాల్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ జి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డీవీ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 14 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ (క్రైం) వెంకటేశ్వరరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైం) జి.వెంకటేశ్వరరావు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. స్వీకరించిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

లోవ హుండీ ఆదాయం రూ.30.70 లక్షలు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.30,69,620 ఆదాయం వచ్చిందని లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖ పెద్దాపురం తనిఖీ అధికారి సీహెచ్ ఉదయబాబునాయుడు, ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్యానాయుడు పర్యవేక్షణలో హుండీలను సోమవారం తెరచి లెక్కించారు. గత 46 రోజులకు చిల్లర రూపంలో రూ.1,72,940, నగదు రూపంలో రూ.28,96,680 మేర ఆదాయం సమకూరిందన్నారు. అలాగే 24 గ్రాముల బంగారం, 925 గ్రాముల వెండి వచ్చాయన్నారు.

సాకారం.. విద్యా మణిహారం

- కాకినాడలోనే ఐఐఎఫ్‌టీ క్యాంపస్
- తరలింపుపై తొలగిన అనుమానాలు
- నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- రూ.230 కోట్లతో చకాచకా పనులు
- రూ.11 కోట్లు మంజూరు చేసిన సీఎం
- టెండర్ల ప్రక్రియ ఎన్‌బీసీసీకి అప్పగింత



జేఎన్‌టీయుకేలో ఐఐఎఫ్‌టీ తాత్కాలిక క్యాంపస్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) క్యాంపస్ రాష్ట్రం దాటిపోతుందనే అనుమానాలు పటాపంచలయ్యాయి. కాకినాడ క్యాంపస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సోమవారం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ విషయం స్పష్టమైంది. దేశంలో ఢిల్లీ, కోల్‌కతా తరువాత మూడో క్యాంపస్‌గా కాకినాడ మంజూరైంది. అయితే ఇక్కడ దీని కొనసాగింపుపై తొలి నుంచీ సందిగ్ధత నెలకొంది. ఈ ప్రతిపాదన తెర పైకి వచ్చినప్పటి నుంచీ ఈ క్యాంపస్‌ను తరలించుకుపోయేందుకు ఇరుగుపొరుగు రాష్ట్రాలు ప్రయత్నించాయి. మరోపక్క కాకినాడలో విమాన సౌకర్యం, సరైన మౌలిక వసతులు లేవనే కారణాలతో విశాఖపట్నంలో ఏర్పాటు చేయడానికి కేంద్రం ఆసక్తి చూపింది. విశాఖలో క్యాంపస్ ఏర్పాటు చేసి 2015-16 విద్యా సంవత్సరంలో ఐఐఎఫ్‌టీ తరగతులు ప్రారంభించాలనే ఆదేశాలు కూడా వచ్చేశాయి. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఈ క్యాంపస్ కోసం గత పాలకులు విఫలయత్నం చేశారు.

ప్రతికూల పరిస్థితులను అధిగమించి..

ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో కాకినాడలో ఐఐఎఫ్‌టీ క్యాంపస్ కోసం పార్లమెంటు స్థాయిలో స్థానిక ఎంపీ వంగా గీత గట్టి ప్రయత్నమే చేశారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఉన్న పరిచయాలను ఉపయోగించుకున్నారు. మరోపక్క ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఎట్టకేలకు ఆయన చొరవతో కాకినాడలో ఐఐఎఫ్‌టీ ఏర్పాటుకు మార్గం సుగమమైన సంగతి తెలిసిందే. ఈ క్యాంపస్‌కు కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి(కేఎస్ఈజెడ్)లో 25 ఎకరాలు కేటాయించి, క్యాంపస్ ఏర్పాటులో సీఎం జగన్ క్రియాశీలకంగా వ్యవహరించారు. తాత్కాలికంగా జేఎన్‌టీయూకేలో ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ఏర్పాటు చేసి, కేంద్ర మంత్రులతో ప్రారంభోత్సవం కూడా చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడత భాగస్వామ్యంగా రూ.11 కోట్లు మంజూరు చేయడంతో కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా ముందుకు వచ్చింది. ప్రస్తుతం జేఎన్‌టీయూకేలో తాత్కాలిక ప్రాతిపదికన క్యాంపస్ నిర్మాణం జరుగుతోంది. సమీప భవిష్యత్‌లో కేఎస్ఈజెడ్‌లో కేటాయించిన 25 ఎకరాల్లో శాశ్వత ప్రాతిపదికన కాలేజీ భవనాలు, పరిపాలన భవనాలు, విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, స్పోర్ట్స్, అధునాతన ఆడిటోరియం వంటి నిర్మాణాలు మొదలు కానున్నాయి. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక క్యాంపస్ కావడంతో నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్‌బీసీసీ)కి అప్పగించింది. క్యాంపస్ నిర్మాణానికి మొదటి విడతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో రూ.230 కోట్లు కేటాయించనున్నాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను ఎన్‌బీసీసీ ప్రారంభించింది.

ఆకర్షణీయమైన వేతనాలు

ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ, ఎంఏ (ఎకనామిక్స్), ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం), డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సులను ఐఐఎఫ్‌టీ అందిస్తోంది. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రారంభంలోనే ఏటా రూ.12 లక్షల నుంచి రూ.65 లక్షల వరకూ ఆకర్షణీయమైన వేతనాలు ఉంటాయి. దేశ, విదేశాల్లో ఉద్యోగావకాశాలకు ఈ ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సు ఎంతో దోహదపడుతుంది. 40 సీట్లతో ఐదేళ్ల వ్యవధి కలిగిన ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం - బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటర్నేషనల్ బిజినెస్) కోర్సు ఇప్పటికే ప్రారంభమైంది. క్యాంపస్‌లో సీటు కొడితే షేర్‌మార్కెట్ వంటి రంగాల్లో జాతీయ స్థాయిలో మంచి ప్యాకేజీలతో కొలువులు దక్కనున్నాయి. ఇటువంటి ప్రతిష్టాత్మక క్యాంపస్‌ను ఇక్కడ శాశ్వతంగా నిర్మించేందుకు ఇక్కడి ప్రజాప్రతినిధులు సాగిస్తున్న మూడేళ్ల కృషి ఎట్టకేలకు సాకారమైంది.

మంచి ఉద్యోగావకాశాలు



దేశంలోనే మూడో క్యాంపస్ అయిన కాకినాడలో ఐఐఎఫ్‌టీ నిర్మాణానికి అడుగులు పడటం అభినందనీయం. ఈ క్యాంపస్ పూర్తి కావడం ద్వారా మరిన్ని కోర్సులు అందుబాటులోకి వస్తాయి. పూర్తిగా వర్తక, వాణిజ్య, వ్యాపారానికి సంబంధించిన కోర్సులు కావడంతో వీటిని అభ్యసించిన వారికి మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయి. ముఖ్యంగా కాకినాడ పరిసర ప్రాంతాల విద్యార్థులకు దీనిని వరంగా చెప్పవచ్చు.

– వర్ధమూడి రవీంద్ర సారథి, క్యాంపస్ హెడ్, ఐఐఎఫ్‌టీ, కాకినాడ

మూడేళ్ల ప్రయత్నం ఫలించింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఐఐఎఫ్‌టీకి శాశ్వత క్యాంపస్ ఒనగూరుతోంది. అడిగిన వెంటనే ముఖ్యమంత్రి తొలి విడత నిధులు మంజూరు చేయడంతో ఇది సాకారమైంది. క్యాంపస్ నిర్మాణానికి అనుమతించడం ద్వారా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించినట్లయింది. ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, నిర్మలా సీతారామన్‌లకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారు.

– వంగా గీత, ఎంపీ, కాకినాడ

18న దేవరపల్లికి కంచి పీఠాధిపతి

దేవరపల్లి: కంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి తన విజయ యాత్రలో భాగంగా ఈ నెల 18న దేవరపల్లి వస్తున్నారు. ఆయన 20వ తేదీ వరకూ ఇక్కడ పలు ఆలయాలను సందర్శించనున్నారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాలను, ఆదిశంకరాచార్యుల మందిరాన్ని సందర్శించి పూజలు నిర్వహిస్తారని శ్రీవారి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. స్వామీజీ 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు దేవరపల్లి చేరుకుంటారన్నారు. ఆయనకు మూడు రోడ్ల కూడలిలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శ్రీవారి ఆలయం వరకూ శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామీజీ శ్రీవారిని, రామలింగేశ్వరస్వామి వారిని, ఆదిశంకరాచార్యులను దర్శించుకుంటారని చెప్పారు. 19వ తేదీ సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అనుగ్రహ భాషణం ఉంటాయన్నారు. 20వ తేదీన త్రికాలార్చన, అమ్మవారికి, శ్రీవారికి అర్చనలు, ప్రత్యేక పూజలు, భక్తులకు అనుగ్రహ భాషణం ఉంటాయని తెలిపారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీనివాసరావు చెప్పారు. శ్రీవారికి అభిషేకానికి, పీఠాధిపతుల స్నానానికి శివాలయంలో కొత్తగా బావి తవ్వామని తెలిపారు. రోజుకు 200 బిందెల బావి జలాలతో స్వామి వారికి అభిషేకం జరుగుతుందన్నారు. శ్రీవారి దేవస్థానం అర్చకుల నూతన భవనంలో స్వామీజీ బస చేస్తారని చెప్పారు. సుమారు 10 వేల మంది భక్తులు పూజా కార్యక్రమాలకు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. శంకర విజయేంద్ర సరస్వతిని దేవస్థానానికి తీసుకు వచ్చేందుకు 2020 నుంచి చేస్తున్న కృషి ఇప్పటికి ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ శారద

- పూర్తయిన ఏర్పాట్లు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ఏప్రిల్ 4 వరకూ జరగనున్నాయి. వీటికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశామని ఇంటర్ బోర్డు జోన్-1, 2 ఆర్‌జేడీ ఐ.శారద, ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. రీజినల్ ఇంటర్మీడియెట్ విద్యా మండలి అధికారి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పరీక్షలు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 1,02,643 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని శారద తెలిపారు. అన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రిన్సిపాల్స్ వారి విద్యార్థులకు వెంటనే హాల్ టికెట్లు అందజేయాలని ఆదేశించారు. హాల్ టికెట్లు నిలుపు చేసే కళాశాలల యాజమాన్యాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా హాల్ టికెట్లు తీసుకోని విద్యార్థులుంటే వెంటనే ఆయా ప్రిన్సిపాళ్ల నుంచి పొందాలని సూచించారు. పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 10 సిటింగ్ స్క్వాడ్‌లను నియమించామని, 13 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని తెలిపారు. జిల్లాలోని 53 పోలీసు స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరిచామని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు మాత్రమే వాటిని పరీక్ష కేంద్రానికి తరలిస్తామని చెప్పారు. పరీక్ష హాలులోకి సిబ్బందితో సహా ఎవ్వరికీ సెల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులు నడుస్తాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్యులు, సిబ్బందితో పాటు 108 వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. తాగునీరు, తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేశామన్నారు. పరీక్ష జరిగే రోజుల్లో ఆయా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

జిల్లాల వారీగా ఏర్పాట్లు ఇవీ..

జిల్లా పేరు	మొత్తం కేంద్రాలు	పరీక్ష రాసే విద్యార్థులు
కాకినాడ	60	41,817
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	38	28,973
అల్లూరి సీతారామరాజు	10	4,922
రాజమహేంద్రవరం డివిజన్	35	26,931
కొవ్వూరు డివిజన్	12	10,357

ముగిసిన మండలి పోరు



పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ



ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

- ప్రశాంతంగా ఉమ్మడి పశ్చిమ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు
- కొవ్వూరు డివిజన్‌లో 99.17 శాతం ఓటింగ్
- ఓటు వేసిన మంత్రి వనిత, ఎమ్మెల్యేలు

కొవ్వూరు: శాసన మండలికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో రెండు స్థానాలకు సోమవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓటర్లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 4 వరకూ సమయం ఉన్నప్పటికీ మధ్యాహ్నం 12.45 గంటలకే ముగిసింది. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండి, ప్రస్తుతం తూర్పు గోదావరి పరిధిలోకి వచ్చిన గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లో ఈ ఎన్నికలకు మొత్తం 242 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 240 మంది ఓటు వేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సగటున 95.93 శాతం పోలింగ్ జరగగా, కొవ్వూరులో గరిష్టంగా 99.17 శాతం నమోదైంది. నల్లజర్ల మండలం తెలికిచెర్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు తాడిగడప మంగ దుబాయ్‌లో ఉన్నారు. నిడదవోలు మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ మేడపాటి సరితారెడ్డి అనారోగ్య సమస్యతో బెంగళూరులో ఉన్నారు. దీంతో వీరిద్దరూ మినహా మిగిలిన 240 మందీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లలో 135 మంది మహిళా ఓటర్లు ఉండగా వీరిలో 133 మంది ఓటు వేశారు. పురుష ఓటర్లు 107 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సహాయ ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, జిల్లా అడిషనల్ ఎస్పీ ఎం.రజని, డీఎస్పీ వీఏఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో అంత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ బ్యాలెట్ బాక్సులను ఏలూరు తరలించారు. బ్యాలెట్ బాక్సును తరలించారు.

ఓటు వేసిన ప్రముఖులు

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, అక్కడి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆ నియోజకవర్గ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ తదితర ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 94 ఓట్లకు గాను 93, గోపాలపురంలో 67కు 66, కొవ్వూరులో మొత్తం 81 మందీ పోలింగ్‌కు హాజరయ్యారు.

పోలింగ్‌ను పరిశీలించిన కలెక్టర్

పోలింగ్ సరళిని కలెక్టర్ కె.మాధవీలత పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వెలుపల ఏర్పాటు చేసిన గుర్తింపు కార్డుల పరిశీలన కేంద్రాన్ని సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలించామని చెప్పారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

100% ఈ-క్రాప్

- జిల్లా వ్యాప్తంగా 1,84,558.4 ఎకరాల్లో పంటల నమోదు
- 17 వరకూ ఆర్‌బీకేలలో ముసాయిదా జాబితా
- 97.86 శాతం మేర ఈ-కేవైసీ పూర్తి

రాజమహేంద్రవరం రూరల్: రబీ సీజన్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఈ-క్రాప్ నమోదు వంద శాతం పూర్తయింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన ఈ-క్రాప్ నమోదుకు అధికారులు శ్రీకారం చుట్టారు. వ్యవసాయాధికారులు, రైతుభరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే)ని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు(వీఏఏ), వీఆర్‌ఓలు కలిసి సంయుక్తంగా రైతుల ఇళ్లు, పొలాల వద్దకు వెళ్లి ఈ ప్రక్రియను పక్కాగా చేపట్టారు. ఈ నెల 4వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,84,558.4 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడం ద్వారా వంద శాతం పూర్తి చేశారు. దీని ఆధారంగానే రైతులకు సంక్షేమ ఫలాలు అందుతాయి. రైతుల ఈ-కేవైసీ కూడా 1,79,818.26 ఎకరాలకు (97.86 శాతం) పూర్తి చేశారు. ప్రభుత్వం నుంచి రైతు భరోసా, సబ్సిడీపై ఎరువులు, ఇతర పథకాల అమలుకు ఈ-కేవైసీ తప్పనిసరి.

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ఇలా..

మండలం	పొలం (ఎకరాల్లో)	ఈ-క్రాప్ నమోదు	ఈ-కేవైసీ నమోదు
అనపర్తి	9333.29	9333.29	8383.02
బిక్కవోలు	14235.46	14235.46	12980.63
గోకవరం	7060.61	7060.61	6760.77
కడియం	5417.32	5417.32	5225.84
పెరవలి	8088.92	8088.92	7869.39
కోరుకొండ	8728.01	8728.01	8538.74
చాగల్లు	8605.96	8605.96	8401.65
నిడదవోలు	17093.89	17093.89	16735.48
రాజానగరం	8394.94	8394.94	8264
దేవరపల్లి	13877.1	13877.1	13631.77
నల్లజర్ల	12985.98	12985.98	12795.05
కొవ్వూరు	11757.23	11757.23	11555.42
రంగంపేట	4828.89	4828.89	4781.04
ఉండ్రాజవరం	11485.96	11485.96	11373.01
గోపాలపురం	14501.89	14501.89	14433.66
తాళ్లపూడి	10051.42	10051.42	10020.88
సీతానగరం	15151.88	15151.88	15108.27
రాజమహేంద్రవరం రూరల్	2959.62	2959.62	2959.62



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (ఫైల్)

ఈ-క్రాప్‌తో ఇవీ లాభాలు

- ఆపద సమయంలో రైతులకు ఈ-క్రాప్ నమోదు ఉపయోగపడుతుంది.
- ప్రకృతి వైపరీత్యాలు, తుపానులు, కరువు వచ్చి పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు ఈ-క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకుంటుంది.
- పంటల బీమాకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి.
- తాము పండించిన ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఈ-క్రాప్ ద్వారా అమ్ముకోవచ్చు.
- పంటల సాగు విస్తీర్ణం కచ్చితంగా నమోదవుతుంది.
- ప్రణాళిక ప్రకారం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల సరఫరాకు ఉపయోగపడుతుంది.
- కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులు ఇచ్చి రైతుభరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సహాయం కూడా అందించవచ్చు.
- ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ శాఖల ఇన్‌పుట్ సబ్సిడీకి కూడా ఈ-క్రాప్ తప్పనిసరి.

అభ్యంతరాలకు 17 వరకూ గడువు



సామాజిక తనిఖీలో భాగంగా ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను జిల్లాలోని అన్ని ఆర్‌బీకేల వద్ద ఈ నెల 17 వరకూ ప్రదర్శిస్తున్నాం. అనంతరం గ్రామసభలు నిర్వహిస్తాం. వీటిల్లో జాబితాలో ఉన్న రైతుల వివరాలను ఆర్‌బీకే చదివి వినిపిస్తారు. ముసాయిదా జాబితాను రైతులు పరిశీలించి, అభ్యంతరాలు, సవరణలపై ఆయా ఆర్‌బీకేల్లోని వీఏఏ/వీహెచ్ఏ/వీఎస్ఏలకు రాతపూర్వకంగా తెలియజేయాలి. రబీ ఈ-క్రాప్ సవరణకు ఇదే చివరి అవకాశం. తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు సాధ్యం కాదు.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేశారు

కంభంపాటి జయంతి సభలో కొనియాడిన వక్తలు



స్వయంప్రకాష్ జయంతి సభలో నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వేదం పట్ల, ధర్మం పట్ల నిష్ఠ కలిగిన డాక్టర్ కంభంపాటి స్వయం ప్రకాష్ లైంగిక విజ్ఞానాన్ని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో వివరించేవారని, శాస్త్రీయ విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేయాలనేది ఆయన ఆశయమని వక్తలు కొనియాడారు. డాక్టర్ కంభంపాటి స్వయం ప్రకాష్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రచయిత, డాక్టర్ కంభంపాటి స్వయం ప్రకాష్ 61వ జయంతి సభ హోటల్ షెల్టాన్ సమావేశ మందిరంలో జరిగింది. జర్నలిస్టు మ్యాగజైన్ ఎడిటర్ పి.వి.కృష్ణంరాజు అధ్యక్షత వహించిన సభలో రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ప్రాచార్య డాక్టర్ శలాక రఘునాథశర్మ, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి, షణ్ముఖ వేదపాఠశాల నిర్వాహకుడు కప్పగంతుల రామకృష్ణ, డాక్టర్ కవికొండల శ్రీనివాస్, స్వయం ప్రకాష్ సతీమణి, ట్రస్టు అధ్యక్షురాలు కంభంపాటి రమాదేవి, కుమార్తె డాక్టర్ కంభంపాటి లలిత, అల్లుడు డాక్టర్ రఘు, కుమారుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. కంభంపాటి స్వయం ప్రకాష్ బావమరిది శేషాచల శర్మ అతిథులకు స్వాగతం పలికారు. డాక్టర్ కంభంపాటి లలిత మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను, వారసత్వాన్ని తమ హిలియోస్ ఆసుపత్రి, డాక్టర్ లలిత మెటర్నిటీ ఇన్ ఫెర్టిలిటీ ఆసుపత్రి ద్వారా కొనసాగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విజయబాబు మాట్లాడుతూ స్వయంప్రకాష్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డాక్టర్ శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ వాత్స్యాన కామ సూత్రాల సారాన్ని సామాన్యులకు అందించారని, లైంగిక విజ్ఞానాన్ని అందరికీ చేరువ చేసిన స్వయం ప్రకాష్ ఇండియన్ సెక్సాలజిస్ట్ అని పేర్కొన్నారు. డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ విభిన్న అంశాలపై ఆయన ఐదువేల వ్యాసాలు రాయడం చిన్న విషయం కాదన్నారు. జర్నలిస్టు మ్యాగజైన్ తరఫున స్వయం ప్రకాష్ సతీమణి రమాదేవికి ఔట్ స్టాండింగ్ మదర్ పురస్కారం అందచేశారు.

ఆస్కార్ మాకు గర్వకారణం

నిర్మాత డి.వి.వి దానయ్య సొంతూరు తాళ్లపూడి వాసుల ఆనందం



ఇటీవల తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సందర్భంలో రెవెన్యూ అధికారులతో దానయ్య

తాళ్లపూడి: చిత్ర పరిశ్రమలో అగ్ర నిర్మాతల్లో ఒకరుగా కొనసాగుతున్న ప్రముఖ సినీ నిర్మాత డి.వి.వి. దానయ్య తాళ్లపూడికి చెందినవారే. రామ్ చరణ్, ఎన్టీఆర్ కలిసి నటించిన ఆర్ఆర్ఆర్ చిత్రంలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంపై ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజమౌళి, కీరవాణి, చంద్రబోస్‌లతో పాటు దానయ్య నిర్మాత ఈ ప్రాంతం వారు కావడం విశేషం. దానయ్య పూర్తి పేరు దాసరి వీర వెంకట దానయ్య. తరచు ఈ ప్రాంతం వచ్చి వెళుతూ ఉంటారు. ఈ ప్రాంతంలోని తన స్నేహితులను కలిసి వెళుతూ ఉంటారు. ఇటీవలే తహసీల్దార్ కార్యాలయానికి వ్యక్తిగత పనిపై వచ్చారు.

జంబలకిడిపంబతో నిర్మాతగా ప్రస్థానం

ఆయనకు చిత్ర పరిశ్రమపై ఉన్న మక్కువతో 1986లో ఇక్కడి నుంచి చెన్నై వెళ్లారు. ప్రస్తుతం హైదారాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనతో పాటు ఇదే గ్రామానికి చెందిన జడ్డు భగవాన్, జడ్డు పుల్లారావులతో కలిసి 1992లో ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన జంబలకిడిపంబతో దానయ్య తన సినీ ప్రస్థానం మొదలు పెట్టారు. మొదట్లో వీరు ముగ్గురు కలిసి పలు చిత్రాలను తీశారు. మామిడాకులు, సముద్రం, మనసున్నమారాజు, సీమ సింహం, జూనియర్స్, ఓ రాధా ఇద్దరు కృష్ణుల పెళ్లి చిత్రాలను కలిసి నిర్మాతలుగా తీశారు. వీరితో కలిసి నిర్మించిన మనసున్న మారాజు సినిమా షూటింగ్ ఎక్కువ భాగం కుమారదేవం, ఆరికిరేవుల ప్రాంతాల్లో జరిగింది. ఈ చిత్రాలను బాలాజీ ఆర్ట్ క్రియేషన్ పతాకంపై వీరు తీశారు. యూనివర్సల్ మీడియా బ్యానర్‌ను 2007లో స్థాపించి దేశముదురు, దుబాయ్ శ్రీను, నేనింతే, ఓయ్, వరుడు, తదితర చిత్రాలు నిర్మించారు.



డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై భారీ చిత్రాలు

అనంతరం దానయ్య సొంత బ్యానర్ డి.వి.వి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై పలు భారీ చిత్రాలు తీశారు. భారీ ప్రతిష్టాత్మక చిత్రం ఆర్ఆర్ఆర్ నిర్మించారు. బ్రూస్‌లీ, నిన్నుకోరి, భరత్ అనే నేను, వినయ విధేయ రామ చిత్రాలను కూడా ఈ బ్యానర్‌లో వచ్చినవే. నాయక్, కెమెరామేన్ గంగతో రాంబాబు తదితర చిత్రాలను తెరకెక్కించారు.

మా కుటుంబంతో అనుబంధం



ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ రావడం చాలా గర్వంగా ఉంది. రాజమౌళి, కీరవాణి, చంద్రబోస్‌లకు కూడా ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను. దానయ్య మా అన్నయ్య నిర్మాత భగవాన్‌తో కలిసి చదువుకున్నారు. వారి సహకారంతో 1986లో చెన్నై వెళ్లారు. తాళ్లపూడి వచ్చినప్పుడు తప్పనిసరిగా కలుసుకుని మాట్లాడుకుంటాం.
–జడ్డు శ్రీనివాస్, నిర్మాత భగవాన్ సోదరుడు, తాళ్లపూడి

చిన్న నాటి నుంచి స్నేహితుడు



దానయ్య నాకు చిన్న నాటి నుంచి పరిచయం ఉంది. స్వగ్రామం కావడంతో పాటు 50 సంవత్సరాలుగా మంచి పరిచయాలు ఉన్నాయి. ఊళ్లోకి వస్తే కలుస్తారు. కింది స్థాయి నుంచి అగ్ర నిర్మాతగా ఎదగడం చాలా సంతోషంగా ఉంది. ఆస్కార్ అవార్డు వచ్చిన చిత్రానికి మా దానయ్య నిర్మాత కావడం ఆనందించదగ్గ విషయం.
– నామన పరమేశ్వరరావు, మాజీ సర్పంచ్, తాళ్లపూడి

పరామర్శకు వెళుతూ తిరిగిరాని లోకానికి

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి, కొడుకుకు తీవ్ర గాయాలు



లచ్చన్నదొరను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

పిఠాపురం: మండలంలోని చిత్రాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందగా కొడుకుకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలేనికి చెందిన లోకారెడ్డి లచ్చన్నదొర తన తల్లి లోకారెడ్డి సీతాలక్ష్మిని తీసుకుని గొల్లప్రోలు మండలం చేబ్రోలు బంధువుల ఇంటికి పరామర్శకు బయలుదేరారు. మోటారు సైకిల్‌పై వస్తున్న వారు పిఠాపురం మండలం చిత్రాడ రైల్వే ఓవర్‌బ్రిడ్జి దగ్గరకు వచ్చే సరికి వెనుక వస్తున్న వాహనం హారన్ కొట్టడంతో కంగారు పడి పక్కకు వెళ్లగా బ్రిడ్జికి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌ను ఢీకొని పడిపోయారు. బ్రిడ్జి రైలింగ్ తలకు తగలడంతో గాయాలు కాగా సీతాలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. లచ్చన్నదొరను 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యంతో నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

- పాఠశాల చెంతనే చెత్తను అంటించిన స్థానికుడు
- దట్టంగా కమ్ముకున్న పొగతో 40 మంది విద్యార్థులకు అస్వస్థత
- పీహెచ్‌సీ.. ఏరియా ఆస్పత్రులలో చికిత్స



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్ శుక్లా



చికిత్స పొందుతున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: చిన్నపాటి నిర్లక్ష్యం.. విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేసి అస్వస్థతకు గురి చేసింది. 40 మంది విద్యార్థులను ఆస్పత్రి పాల్జేసింది. సోమవారం జరిగిన ఈ ఘటన ఉపాధ్యాయులను, స్థానికులను, జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించింది. అమలాపురం మండల పరిధిలోని బండారులంక నుంచి గంగలకుర్రు అగ్రహారానికి వెళ్లే రహదారిలో విజ్‌డమ్ పాఠశాల పక్కనే ఉన్న పాన్‌షాప్ యజమాని బిళ్ల వెంకటేశ్వరరావు ఇంటి వెనుక ఉన్న చెత్తకు ఉదయం 10.30 గంటలకు నిప్పు పెట్టాడు. ప్లాస్టిక్ బాటిల్స్, గ్లాసులు, సంచులు, పాత బరకాలు కూడా అంటుకున్నాయి. దీనితో దట్టమైన నల్లని పొగ కమ్మివేసింది. పక్కనే స్కూలులోని చదువుకుంటున్న విద్యార్థులు పొగకు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ పాఠశాలలో సుమారు 300 మంది వరకు ఉన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల పొగ కావడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బంది పడ్డారు. తలతిరగడం, వికారానికి గురికావడంతో విపరీతంగా దగ్గుతూ తల్లడిల్లారు. విద్యార్థులు కళ్లు తిరిగి పడిపోవడాన్ని గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయులు వారిని వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. సుమారు 40 మంది విద్యార్థులను పీహెచ్‌సీకి తరలించగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ కమల వారికి ప్రాథమిక చికిత్స అందించారు.



విజ్‌డమ్ పాఠశాల

అధికారుల అప్రమత్తం

కొంతమంది విద్యార్థులు కోలుకోగా, 16 మందిని మాత్రం ఉన్నత వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక సర్పంచ్ పెనుమాల సునీతతోపాటు పలువురు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనితో అప్రమత్తమైన కలెక్టర్ హిమాన్షు శుక్లా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకరరావుతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. స్పందనలో ఉన్న ఆయనతోపాటు డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర, ఆర్డీవో బి.వసంతరాయుడు అందుబాటులో ఉన్న నాలుగు 108 వాహనాలలో విద్యార్థులను తరలించారు. వీరిలో 11 మందికి ఆక్సిజన్ అందించారు. ఏరియా ఆస్పత్రిలో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో వారు త్వరగా కోలుకున్నారు. ఎనిమిదవ తరగతి విద్యార్థిని కుడుపూడి నిఖిత తీవ్ర అస్వస్థతకు గురైంది. దీనితో ఆమెకు మరింత మెరుగైన వైద్యం అందజేస్తున్నారు. రాష్ట్ర రవాణా శాఖమంత్రి పినిపే విశ్వరూప్ అధికారులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. విద్యార్థుల తల్లిదండ్రులు, వారి బంధువులు, స్థానికులు ఆందోళనతో ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనకు కారణమైన బిళ్ల వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు తాలుకా ఎస్‌ఐ అందే పరదేశి తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ శుక్లా విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, ఎస్‌ఐ పరదేశీ, ఎంఈవో గుబ్బల సూర్య ప్రకాశ్ పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు.

అధికారులపై తేనెటీగల దాడి



ద్రాక్షారామ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఈఓపీఆర్డీ షెలత్‌రాజు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఆదివారం శుభ్రం చేసిన మంచినీటి ట్యాంకును కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం పరిశీలించేందుకు వచ్చిన అధికారులపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో మండల ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాహుల్, ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం గాయపడ్డారు. వీరిలో ఈఓపీఆర్డీపై అధిక సంఖ్యలో తేనెటీగలు దాడి చేయడంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరు ద్రాక్షారామ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

అజీమ్ ప్రేమ్‌జీకి శ్రీ షిర్డి సాయి విద్యార్థులు



అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి ఎంపికైన శ్రీషిర్డీసాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హ్యుమానిటీస్, లిబరల్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రఖ్యాతి గాంచిన అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో వివిధ కోర్సులలో ఉన్నత విద్యను అభ్యసించడానికి రాజమండ్రి శ్రీ షిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు 17మంది ఎంపికైనట్లు విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ డాఫ్నీ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కె.రామతేజ, లలిత్ రాజపుట్, ఎన్.ఆశిష్, ఎమ్.ఎస్.ఎస్.సందీప్, కె.త్రిషిత, బీఏ. ఎకనమిక్స్ కోర్సుకు ఎంపికయ్యారన్నారు. ఎస్.కమలి, సీహెచ్ కుసుమ, కేకే నయనసాన్వి, ఎ.భార్గవ్, పి.కృష్ణ విజయ్, ఎ.సహిష్ణు, బీఏ హిస్టరీ కోర్సుకు, జె.శర్వాణి, ఎ.సిద్ధార్థ, బీఏ సోషల్ సైన్స్‌కు, పి.సృజన్ బీఏ ఫిలాసఫీకి, కె.అక్షయ, ఇ.దేదీప్య, బీఎస్సీ ఎన్విరాన్మెంట్ సైన్సెస్‌కు, ఏఎస్.వెంకట రమ్య బీఎస్సీ మేథమెటిక్స్ కోర్సుకు ఎంపికైనట్లు వివరించారు. ఏటా తమ విద్యార్థులు ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్య అభ్యసించడం ఎంతో హర్షణీయమని, విజేతలైన విద్యార్థులను, దీనికి కృషి చేసిన అధ్యాపకులను శ్రీ షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, సివిల్స్ డీన్ రాజేష్ అభినందించారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో మోటార్ బైక్ ధ్వంసం

ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న వాహన చోదకుడు



ధ్వంసమైన మోటార్ సైకిల్

కరప: మండలం వేళంగి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ ధ్వంసం కాగా, వాహన చోదకుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... అనపర్తికి చెందిన బల్ల ప్రసన్న మోటార్ సైకిల్‌పై రామచంద్రపురం వైపు వెళుతూ వేళంగిలోని నిత్యానందపురం సెంటర్ రోడ్డు మలుపు వద్దకు వెళ్లే సరికి రామచంద్రపురం నుంచి కాకినాడ వైపు వెళుతున్న లారీ ఎదురుగావచ్చి ఢీకొట్టింది. మోటార్ సైకిల్ హేండిల్ లారీకి తగులుకుని కొంతదూరం ఈడ్చుకు పోవడంతో బైక్ ముందు చక్రం ఊడిపోయి, ధ్వంసమైంది. మోటార్ సైకిల్‌పై వెళుతున్న ప్రసన్న ప్రమాదాన్ని పసిగట్టి పక్కకు దూకేయడంతో స్వల్పగాయాలతో బయటపడి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. వేళంగి గ్రామసచివాలయం -2లో పనిచేస్తున్న మహిళా పోలీసు ఎన్.యశోద ఘటనా స్థలానికెళ్లి లారీ డ్రైవర్‌ను పట్టుకుని కరప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. ఏఎస్‌ఐ జి.ప్రసన్నకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కరప పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు విధులను ఆటంక పర్చినందుకు జైలు

కపిలేశ్వరపురం: పోలీసు విధులను ఆటంక పరచిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష పడింది. అంగర ఎస్సై జి.చంటి తెలిపిన వివరాల ప్రకారం.. అంగర పోలీస్ కానిస్టేబుల్ కె.సత్యనారాయణ 2019 మే 11న మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో గస్తీ తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన కరిపోతు ప్రసన్నకుమార్ దౌర్జన్యం చేస్తూ విధులను ఆటంకపర్చాడు. ఘటనపై అప్పటి ఎస్సై జె.జేమ్స్‌రత్నప్రసాద్ కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో బాధితుడి తరఫున ఏపీపీ విల్ల శ్రీరాములు వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఒక నెల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప సోమవారం తీర్పు చెప్పారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

చాగల్లు: నిర్లక్ష్యంగా లారీ నడిపి ఇద్దరు మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. ఆదివారం రాత్రి బ్రాహ్మణగూడెం శివారులో మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. నిడదవోలు నుంచి తాపీ పని ముగించుకుని ఇంటికి తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నందిగంపాడు గ్రామానికి చెందిన పెదమర్తి కర్నేలు(15) మద్దురు గ్రామానికి చెందిన తోర్లపాటి భరత్(26) అక్కడికక్కడే మృతి చెందగా కరిశనపు ఆనంద్ గాయాలతో నిడదవోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న డ్రైవర్ దూళపల్లి శివకృష్ణపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నల్లజర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. నల్లజర్లలో అపోలో ఫార్మసీ మందులషాపు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రవ్వ నాగరాజు (27) గోపాలపురం మండలం సంజీవపురంలో నివాసముంటూ రోజూ నల్లజర్లకు స్కూటీపై వచ్చి వెళుతుంటాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి వస్తూ 10 గంటల సమయంలో అచ్చన్నపాలెం వద్ద ఫ్లై ఓవర్‌ను దిగుతూ ఎడమ వైపు డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో నాగరాజు 10 అడుగుల దూరంలో పడిపోగా, 50 అడుగుల దూరంలో స్కూటీ పడి ఉంది. హెల్మెట్ ధరించి ఉన్నా నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ నరసింహమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.